06022025-MAI-06_Layout 1 2/6/2025 2:48 AM Page 1



'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

# బీసీల ఆశలపై కాంగ్రెస్ నీళ్లు

నీలం రంగు గుంటనక్క నీళ్లల్లో తడిసింది. పులుముకున్న బులుగు రంగు ఆ దెబ్బకు ఇడిసింది. ఓట్లు కొల్లగొట్టేందుకు కాంగ్రెస్ చెప్పిన మాటలు నీటిమూటలై పాయె అన్నట్టు ఆరునెలల్లో అమలు చేస్తామన్న బీసీ రిజర్వేషన్ల పెంపు పదహారు నెలలైనా అయ్యేట్టు కనిపించడం లేదు. వెన్నుపోట్ల పరంపరలో ఇప్పుడు బీసీల వంతు. కులగణన ఓ ప్రహసనంలా మారింది. తప్పుల తడక లాంటి నివేదికను ముందు పెట్టి తమాషా చేస్తున్నారు. అధికారంలో వాటా కోసం కొట్లాడుతున్న బీసీ సోదరుల ఆశలపై నీళ్లు గుమ్మరించారు. జనాభాలో 60 శాతం ఉన్నామనీ, అదే దామాషాతో స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు పెంచాలనీ బీసీలు డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతమున్న 23 శాతం రిజర్వేషన్లను ఎన్నికలకు ముందు కాంగ్రెస్ హామీ ఇచ్చినట్టుగా కనీసం 42 శాతానికైనా పెంచాలని వారంటున్నారు. కానీ కాంగ్రెస్‌కు ఆ మాత్రం పెంచే ఉద్దేశం కూడా లేనట్టుగానే కనిపిస్తున్నది. బీసీల లెక్కలను తిమ్మిని బమ్మిని చేయాలని చూస్తుండటమే అందుకు కారణం. బీసీలు 46.25 శాతానికి మించి లేరని సర్కారు వేసిన లెక్కలు వింతల్లోకెల్లా వింతగా చెప్పుకోవాలి. అసలు ఆ లెక్కలు ఎక్కడి నుంచి తెచ్చారో వారికే తెలియాలి. పదేండ్లలో పెరిగిన తెలంగాణ జనాభా రెండు లక్షలే నంటూ రెండు చెవుల్లో రెండేసి పువ్వులు పెడుతుండటం మరీ విడ్డూరం.

2014లో బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్వహించిన కుటుంబ సర్వే లెక్కలతోనూ సర్కారు వండివార్చిన గణాంకాలకు పొంతన కుదరడం లేదు. అసలు జనాభా పెరుగుదలే అంతంతమాత్రమంటూ, బీసీల జనాభా తగ్గినట్టు చూపడం అనుమానాలకు దారితీస్తున్నది. బీసీలకు మొండిచెయ్యి చూపేందుకు, రిజర్వేషన్ల విషయంలో అసలుకే ఎసరు తెచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్టుగా ఉంది. 42 శాతం కోటాకైనా బిల్లు పెట్టి చట్టం తెస్తారేమో అనుకుంటే ఆ పని చేయకుండా అష్టవంకర్లు తిరుగుతున్నారు. కేంద్రం ఒప్పుకుంటేనే జరుగుతుందని ప్లేటు ఫిరాయిస్తున్నారు. మరి ఆ సంగతి హామీ ఇచ్చేటప్పుడు తెలియదా? ఇప్పుడేమో బిల్లు సంగతి పక్కన పెట్టి తీర్మానం చేసి కేంద్రానికి పంపిద్దామంటున్నారు. ఇస్తే కేంద్రం దయ. ఇవ్వకపోతే పార్టీ పరంగా అమలు చేస్తామంటూ మేకపోతు గాంభీర్యం. మీరూ అలాగే చేయండని విపక్షాలకు గడుసుగా సవాలు విసురుతున్నారు సీఎం రేవంత్. ఆ మాత్రం దానికి కామారెడ్డి డిక్లరేషన్ ఎందుకు? అరకొర నివేదికతో అసెంబ్లీలో ఆగమాగం చేసుడేంది? అన్ని వివరాలు లేవని వెనుకకు తగ్గుడేంది? బీసీలపై సర్కారు కురిపించింది కపట ప్రేమేనని ఈ తీరుతెన్నులు చెప్పకనే చెప్తున్నాయి. అసెంబ్లీ సాక్షిగా బడుగుల రిజర్వేషన్లకు మంగళం పాడేందుకు జరిపిన తతంగమే ఇందుకు నిదర్శనం. ఈ మోసాన్ని గ్రహించి ఆగ్రహించిన బీసీలు పోరుబాట పడుతున్నారు. విపక్ష బీఆర్ఎస్ అడుగడుగునా సర్కారు సాకులను నిలదీస్తూ నిద్రలేకుండా చేస్తున్నది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్‌లోని బీసీ నేతలు రైడా తిరుగుబాట పడుతున్న సూచనలు వెలువడుతుండటం గమనార్హం.

సందట్లో సడేమియా అన్నట్టు ఈ కుప్పిగంతుల వల్ల మరో ప్రమాదమూ పొడసూపుతున్నది. జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్ వ్యవస్థీకరణ అంటూ కేంద్రం పావులు కదుపుతున్న వేళ రాష్ట్ర ప్రభుత్వం తనంతట తానుగా మా జనాభా తక్కువ అని చెప్పుకోవడం మన ప్రాతినిధ్యానికి మనమే ముప్పు తెచ్చుకోవడం కాదా? బీసీలతో పాటుగా యావత్తు రాష్ట్రాన్ని బలిపెట్టేస్తుండటం దురదృష్టకరం. వ్యూహరచనా ప్రావీణ్యం, పరిపాలనా నైపుణ్యం లేని అసమర్థ పాలకుల నిర్వాకం ఇది. హామీలు, ఆపై గ్యారెంటీలు, అవీ సరిపోవని డిక్లరేషన్లు. తీరా గెలిచాక 'ఆడలేక మద్దెల ఓడు' తరహా కుంటిసాకులు. కొన్ని బుకాయింపులు, మరికొన్ని దబాయింపులు. ఇంతకు మించి ఈ సర్కారుకు ఇంకేం చాతకాదని ప్రజలు ఎప్పుడో నిర్ణయానికి వచ్చారు.

# కులగణన కాదు.. కుట్రల గణన



తోటకూర రమేశ్
98661 68676

**ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలు విషయంలో కాంగ్రెస్ ఎలాగైతే ప్రజలకు మోసం చేసిందో, సమగ్ర కుటుంబ కుల గణన విషయంలోనూ అలానే మోసం చేసింది. ప్రజలను నమ్మించి గొంతు కోసింది. కుల గణన ద్వారా మెజార్టీ బహుజనులకు ఆర్థిక, రాజకీయ, సామాజిక న్యాయం జరుగుతుందనుకున్న ఆశలను నీరు గార్చింది. అసెంబ్లీలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన కుల నివేదికతో బండారం బయటపడింది.**

ప్రభుత్వం విడుదల చేసిన కుల గణన సర్వే తప్పుల తడకగా ఉన్నది. బీసీలకు పూర్తిగా అన్యాయం చేసేలా ఈ నివేదికను ప్రభుత్వం తయారు చేసింది. 'మేమెంతో.. మాకంత' అన్న బలహీన వర్గాల ఆశలపై నీళ్లు చల్లింది. ఈ కుల గణనతో బీసీలకు న్యాయం జరుగుడు మాట దేవుడెరుగు.. పూర్తిగా అన్యాయం జరిగినట్టు స్పష్టంగా కనిపిస్తున్నది. బీసీ జనాభాను తక్కువ చేసి చూపెట్టడం అంటే బీసీలకు హక్కుగా రావాల్సిన రాజకీయ ఆర్థిక సామాజిక అవకాశాలను అందకుండా చేయడమే అవుతుంది.

మరోవైపు, ప్రభుత్వం ప్రవేశపెట్టిన నివేదిక బలహీనవర్గాల విషయంలో ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. బహుజనులకు న్యాయం చేయాలన్న ఉద్దేశమే కాంగ్రెస్ పార్టీకి ఉంటే సర్వే నివేదికలో క్యాస్ట్, సబ్ క్యాస్ట్‌ను స్పష్టంగా చూపెట్టేవారు. కానీ, ప్రభుత్వ రిపోర్ట్‌లో గంపగుత్తగా బీసీలు ఇంత, మైనార్టీలు ఇంత, ఓసీలు, ఎస్సీలు ఇంతమంది అని ప్రకటించారు తప్పితే సబ్ క్యాస్ట్‌ల ప్రస్తావన తీసుకురాలేదు.

రేవంత్‌రెడ్డి ప్రవేశపెట్టిన తీర్మానంలో మరో వైఫల్యం కూడా స్పష్టంగా కనిపించింది. కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా హిందూ బీసీలు, ముస్లిం బీసీలని తెరపైకి తీసుకొచ్చింది. కాబట్టి భవిష్యత్తులో వారికి ఏ క్యాటగిరీలో రిజర్వేషన్లు ఇస్తుందో రేవంత్ ప్రభుత్వం వివరణ ఇవ్వాలి.

ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బీసీ కుల గణన నివేదికపై కుల సంఘాలు భగ్గుమంటున్నాయి. క్షేత్రస్థాయి వాస్తవాలకు ఇది విరుద్ధంగా ఉన్నదని ఆగ్రహం వ్యకం చేస్తున్నాయి. గతంలో 51శాతంగా ఉన్న బీసీలు ఇప్పుడు 46 శాతానికి ఎలా పడిపోయారని ప్రశ్నిస్తున్నారు. బీసీల జనాభాను ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే తగ్గించిందని బీసీ సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.



కొత్తగా ముస్లిం బీసీలుగా రిపోర్టులో చేర్చడం.. బీసీల జనాభా పెరిగిందని చెప్పే ప్రయత్నమే తప్ప మరోటి కాదు.

ప్రభుత్వ నివేదికలో హాస్యాస్పదమైన విషయం ఇంకోటి ఉన్నది. తెలంగాణలో క్రిస్టియన్ల ప్రస్తావనే లేదు. మైనారిటీల్లో వారు కూడా ఉన్నారో, లేదో తెలియదు. ఈ విషయంపై ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటన లేదు. మైనార్టీల జనాభా 10 శాతం మాత్రమేనని చెప్పడం ద్వారా ఇటు క్రిస్టియన్లకు, అటు ముస్లింలకు అన్యాయం చేయడమే అవుతుంది. వారి రిజర్వేషన్ హక్కులను హరించడమే అవుతుంది.

అంతేకాదు, ముస్లింలకు ప్రభుత్వం వాగ్దానం చేసిన 12 శాతం రిజర్వేషన్‌పై ప్రభావం పడుతుంది. మొత్తంగా ప్రభుత్వం పెట్టిన నివేదిక ప్రజల్లో అపోహలు సృష్టించేలా ఉంది తప్ప ప్రజలు కోరుకున్నట్టు లేదని స్పష్టంగా అర్థమవుతున్నది. మరోవైపు, బీసీ కులాల్లో కూడా ఆధిపత్య వర్గాలు ఉన్నాయి. బీసీల్లో ఉన్న ఉప కులాలపై స్పష్టత ఇవ్వకుండా గంపగుత్తగా రిజర్వేషన్లు అమలు చేస్తే ఫలితాలు నిజమైన లబ్ధిదారులు అందకుండా పోతాయి.

**బీసీ కులగణన రిపోర్ట్ కాంగ్రెస్‌లో చిచ్చు పెట్టింది. సొంత పార్టీ నేతలే కులగణన నివేదికపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సర్వే అంతా తప్పుల తడకగా ఉందని బీసీ ఎమ్మెల్యేలు తప్పుబడుతున్నారు. ఉద్దేశపూర్వకంగానే బీసీల జనాభాను తగ్గించి చూపించారని మండిపడుతున్నారు. సొంత పార్టీ ఎమ్మెల్యేల నుంచి తిరుగుబాటు వస్తుండటంతో ప్రభుత్వం ఇరకాటంలో పడింది.**

కుల గణన రిపోర్ట్ మంత్రి వర్గంలోనే విభేదాలను తారస్థాయికి తీసుకెళ్లింది. సర్వేపై రేవంత్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మధ్య వైరం మరింత ముదిరింది. ప్రకటించిన పథకాలు అమలు చేయకపోవడంతో ప్రభుత్వంపై ప్రజల్లో ఆగ్రహావేశాలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పుడు కుల గణన రిపోర్టుతో సొంత పార్టీలోనే అసంతృప్తి సెగలు కక్కుతున్నది. సమగ్ర కుల గణన స్వచ్ఛందమని, వివరాలు చెప్పాలని డిమాండ్ ఏదీ లేదని చెప్పిన ప్రభుత్వం ఇప్పుడు.. ప్రతిపక్ష నేతలు వివరాలు ఇవ్వలేదని చెప్పడం విడ్డూరం.

స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఈ నివేదికను తయారుచేసినట్టుగా ఉన్నది. ఆ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను తగ్గించేందుకు పక్కా ప్లాన్‌తోనే ఈ బీసీ నివేదికను సభలో ప్రవేశపెట్టినట్టు స్పష్టంగా తెలుస్తున్నది. అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపి చేతులు దులుపుకోవడం తప్ప బీసీలకు న్యాయం చేయాలన్న చిత్తశుద్ధి, సంకల్పం కాంగ్రెస్‌లో ఏకోశానా కనిపించడం లేదు.

## • సంక్షోభంలో కాంగ్రెస్



రాష్ట్రంలో ఏడాది పాలన పూర్తిచేసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షోభంలో పడింది. కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు, బీసీ కులగణన సర్వే వివాదం, ఎమ్మెల్యేల అసంతృప్తి, మిగిలిన మంత్రిత్వశాఖలు భర్తీ చేయకపోవడం, ప్రజా వ్యతిరేకత వంటి అంశాలు ప్రభుత్వంపై ముప్పేట దాడి చేస్తున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డికి సంబంధం లేకుండానే కొందరు మంత్రులు స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకుంటున్నారు. బీసీ కులగణన కమిటీ నివేదికను క్యాబినెట్ ముందుకు తీసుకురావడానికి ముందే బహిరంగంగా ప్రకటించడం రేవంత్‌ను షాక్‌కు గురిచేసింది. దీనిపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో ఎస్సీ వర్గీకరణ కమిటీ నివేదిక మాత్రం క్యాబినెట్ సమావేశానికి ముందు బయట పడకుండా జాగ్రత్త పడ్డారు. ప్రభుత్వంపై సొంత ప్రజాప్రతినిధులకే నమ్మకం లేకుండా పోయింది. బీసీలను ప్రభుత్వం నయవంచనకు గురిచేసిందని, బీసీ జాతిని అవమానించిందంటూ ఆ పార్టీ ఎమ్మెల్సీ చింతపండు నవీన్ అలియాస్ తీన్మార్ మల్లన్న బీసీ నివేదికను దహనం చేశారు. ప్రజా ప్రతినిధులపై పార్టీకి పట్టు లేదని చెప్పడానికి ఇదొక నిదర్శనం.

హైదరాబాద్‌లోని ఓ ఫాంహౌస్‌లో కొందరు ఎమ్మెల్యేలు సమావేశమైనట్టు వార్తలు వచ్చాయి. నియోజకవర్గాల్లో అభివృద్ధికి నిధుల లభ్యత లేకపోవడం, కాంట్రాక్టర్ల బిల్లుల మంజూరులో అవినీతి ఆరోపణలు, మంత్రి స్థాయిలో బలమైన గ్రూపుల ఏర్పాటు వంటి అంశాలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. వరంగల్ జిల్లా నర్సంపేట ఎమ్మెల్యే అయితే ఇప్పటివరకు ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కూడా కలవకపోవడం ప్రజల్లో చర్చకు దారి తీసింది. ప్రభుత్వంలో ఇంకా ఆరు మంత్రిత్వ శాఖలు ఖాళీగా ఉన్నాయి ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటినా ఇప్పటివరకు వాటి భర్తీపై దృష్టి పెట్టకపోవడంతో పదవులు ఆశిస్తున్న సీనియర్ నాయకులు అసంతృప్తితో రగిలిపోతున్నారు. మరోవైపు, ముఖ్యమంత్రి, మంత్రుల మధ్య సమన్వయం పూర్తిగా కొరవడింది. యూనివర్సిటీ ప్రొఫెసర్ల పదవీ విరమణ వయసును పెంచుతామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఆ వెంటనే అలాంటిదేమీ లేదని మంత్రి శ్రీధర్‌బాబు మీడియాతో చెప్పారు. కానీ, పదవీ విరమణ వయసును పెంచుతూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఇదొక్కటే కాదు, ప్రతి అంశంలోనూ ఇలాంటి ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. ఇక, కాంగ్రెస్ పార్టీలో గ్రూపు రాజకీయాలు సరేసరి. అంతర్గత విభేదాలు కూడా పార్టీని చుట్టుముడుతున్నాయి. రాబోయే రోజుల్లో రాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటు చేసుకునే అవకాశం స్పష్టంగా కనిపిస్తున్నది.

**- డాక్టర్ కేతిరెడ్డి వాసుదేవరెడ్డి, 95530 86666**

## • లక్షల డప్పులు.. వేల గొంతులు




'నిశ్శబ్దాల అవనిలో శబ్దం పుట్టించినోన్ని.. శతాబ్దాలుగా శ్రమకు శ్రీకారం చుట్టినోన్ని.. మాదిగోన్ని, మహా ఆదివాణ్ణి..' అని గొంతెత్తి చాటిన ఎర్ర ఉపాలి మాటలను ఈ సందర్భంలో మళ్లీ గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉంది. చరిత్రను పరిశీలిస్తే మాదిగలు తమ శ్రమను సమాజానికి అనేక విధాలుగా అందించారు. శుభకార్యాల నుంచి చావుల వరకు, పండుగల నుంచి ప్రభుత్వ కార్యక్రమాల వరకు తమ డప్పుతో సమాజాన్ని చైతన్యం చేయడం మాదిగల అసమాన కృషికి నిదర్శనం. సాంస్కృతిక విప్లవాలకు మాత్రమే తెలంగాణ పుట్టినిల్లు కాదు. ఇది అన్యాయానికి వ్యతిరేకంగా పోరాటాలకు జన్మనిచ్చిన నేల. ఈ పోరాటాలకు ప్రాణం పోసింది మాదిగ డప్పే. ఈ రోజుకీ పీడిత జనాల్లో చైతన్యం నింపే ప్రధాన సాధనంగా డప్పు కొనసాగుతున్నది. ఆ డప్పును పుట్టించిన మాదిగ కులం ఇప్పుడు తమ హక్కుల సాధన కోసం గొప్ప ఉద్యమానికి శ్రీకారం చుట్టింది. అదే 'లక్షల డప్పులు-వేల గొంతులు' కార్యక్రమం. ఇది చరిత్రలో నిలిచిపోయే ఘట్టంగా మారబోతున్నది. మాదిగ కళాకారులు పాడిన ప్రతి పాట, వేసిన ప్రతి దరువు, సమాజంలోని అసమానతలపై ప్రశ్నించి, హక్కుల కోసం చేసే ఉద్యమానికి ప్రేరణనిచ్చాయి.

సామాజిక అసమానతలను ఎదిరించి, ప్రజలను చైతన్యం చేయడంలో మాదిగ కళాకారుల సహకారం వెలకట్టలేనిది. ఎమ్మార్పీఎస్ ఉద్యమం మాదిగల సమస్యలను ప్రధానంగా ప్రస్తావిస్తూ 30 ఏండ్లుగా తమ హక్కుల కోసం పోరాడుతున్నది. ఇది తొలుత దండోరా ఉద్యమంగా ప్రారంభమై, సామాజిక న్యాయ సాధనగా విస్తరించింది. ఎస్సీ వర్గీకరణను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) అనేక కులాలను చైతన్యం చేస్తున్నది. గత డిసెంబర్ 27న ప్రారంభమైన ఈ ఉద్యమం గ్రామాల గడపలను దాటి, అన్ని వర్గాల మద్దతును కూడగడుతూ ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో లక్ష మందితో భారీ ర్యాలీతో ముగియనున్నది. ఇప్పటికే అనేక కుల సంఘాలు, హక్కుల సంఘాలు, రాజకీయ పార్టీలు ఈ ఉద్యమానికి సంఘీభావం ప్రకటించాయి.

**- డాక్టర్ సుమన్ దామెర, 99086 47775**

## • వీసీల నియామకాల్లో వేలు పెట్టొద్దు!



రాజకీయాల్లో క్రియాశీలకంగా ఉన్న వ్యక్తులనే కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు గవర్నర్లుగా నియమిస్తుంది. అందుకే తరచూ సీఎంలు, గవర్నర్లకు మధ్య వివాదాలు నెలకొంటున్నాయి. మరీ ముఖ్యంగా ప్రాంతీయ పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో గవర్నర్లు వారి పరిధిని మించి రాజకీయాల్లో జోక్యం చేసుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో యూనివర్సిటీలకు వైస్ చాన్సలర్లు, సెర్చ్ కమిటీలను గవర్నర్లే నియమిస్తారని చెప్పడం దారుణం. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలకు వీసీలను సీఎం ప్రతిపాదిస్తే, గవర్నర్ ఆమోదం తెలపడం ఆనవాయితీ. కానీ, విశ్వవిద్యాలయాల నూతన నిబంధనల ముసాయిదాలో చాన్సలర్లే, వైస్ చాన్సలర్లను నియమించేందుకు అనుమతినిస్తూ కేంద్రం నూతన నిబంధనలు రూపొందించింది. దీనిని బీఆర్ఎస్ సహా దేశంలోని అన్ని ప్రాంతీయ పార్టీలు వ్యతిరేకిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వాలకు స్వేచ్ఛ లేకుండా తామే పెత్తనం చేస్తామనడం సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం. ప్రస్తుత నిబంధనల ప్రకారం ఆచార్యులుగా కనీసం పదేండ్ల అనుభవం కలిగిన వారిని వీసీలుగా నియమించవచ్చు. అయితే, ఇప్పుడు ఇండస్ట్రీలో, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, పబ్లిక్ పాలసీల్లో పదేండ్లకు పైగా అనుభవం కలిగిన వారిని వీసీలుగా నియమించవచ్చని సవరించారు. ఈ సవరణ చాలా తీవ్రమైనది. యూజీసీ చట్టం 1956 స్ఫూర్తికి పూర్తిగా విరుద్ధం.

కేంద్రం తనకు లేని అధికారాలను చెలాయించాలని అనుకోవడం అవివేకం. రాష్ట్రం లేదా కేంద్ర విశ్వవిద్యాలయల వీసీల నియామక విధానాలను, అర్హతలను నిర్ధారించేది కేంద్ర లేదా రాష్ట్ర ప్రభుత్వాలేనని సురేష్ పటేకర్ వర్సెస్ ది చాన్స్‌లర్ యూనివర్సిటీ ఆఫ్ మహారాష్ట్ర కేసులో బాంబే హైకోర్టు స్పష్టం చేసింది. విద్య అనేది ఉమ్మడి జాబితాలోని అంశం. అంటే రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చించకుండా ఈ విషయంలో నిర్ణయాలు తీసుకోకూడదు. కానీ సమాఖ్య స్ఫూర్తికి భంగం కలిగిస్తూ కేంద్రం నిర్ణయాలు తీసుకొంటున్నది. 2014కు ముందు సైన్స్ పరిశోధక విద్యార్థులకు బీఎస్ఆర్ (బేసిక్ సైన్స్ రిసెర్చ్) ఫెలోషిప్‌ను యూజీసీ ఇచ్చేది. ఎన్డీయే అధికారంలోకి వచ్చాక దానిని రద్దు చేసింది. అలాగే, ఆర్‌జీఎన్ఎఫ్ ఫెలోషిప్‌లను ఎస్సీ, ఎస్టీలకు రాకుండా చేసిన ఘనత కూడా కేంద్రానిదే.

**- పడాల సతీష్, 98498 91673**


# మత పోరాటం కాదు, మహత్తర పోరాటం..



ఆస్నాల శ్రీనివాస్
96522 75560

**కేంద్రంలో, వివిధ రాష్ట్రాల్లో హిందుత్వ శక్తులు అధికారంలోకి వచ్చినప్పుడల్లా చరిత్రను వక్రీకరిస్తూ, మెదళ్లను విద్వేష భావాలతో నింపివేస్తున్నాయి. పాఠ్యపుస్తకాలను మార్చడం, సెన్సార్ బోర్డును నియంత్రించి భారతీయతకు మసిపూసి మారేడుకాయ చేసేలా విచ్ఛిన్నకర, అశాస్త్రీయ ధోరణులను రెచ్చగొట్టేలా సినిమాలను నిర్మిస్తూ వాటికి ప్రచారం కల్పిస్తున్నాయి.**

తెలంగాణలో సామరస్యతను దెబ్బతీసేందుకు, మహత్తర లక్ష్యాలతో జరిగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని కప్పిపెడుతూ 'రజాకార్' సినిమా తీశారు. రజాకార్లు నిజాం సంస్థానంలో దొరల భూస్వాములకు అండగా ఉన్న ప్రైవేట్ సైన్యం. దీనికి నిజాం రాజు పరోక్ష మద్దతు ఉంది. రజాకార్ ఉపసేనానిగా విస్నూరు దేశముఖ్ రాపాక రామచంద్రారెడ్డి, అధిపతిగా ఖాసిం రజ్వీ ఉన్నారు. ఈ సినిమాలో మత మార్పిడులు, బ్రాహ్మణ హత్యలు, తెలుగు మాట్లాడితే హత్యలు చేసే బృందంగా చిత్రీకరించారు. హిందూ ముస్లిం సంఘర్షణగా చిత్రీకరిస్తూ పటేల్ రక్షకుడిగా ఉండే థీమ్‌తో సాగిందీ సినిమా. బీజేపీ నేతలు నిర్మించి, వారే ప్రమోట్ చేసిన సినిమా ఇది. నిజాం సంస్థానంలో ఏడో తరగతి వరకు తెలుగు రెండవ భాషగా ఉన్నది. ఉర్దూని ప్రధాన భాషగా చేశారు. తాము ఆ సంస్థాన పోరాటాన్ని తమ కండ్లతో చూసినట్టుగా చెప్తూ సినిమాను ప్రమోట్ చేస్తున్నారు. విస్నూరు దేశముఖ్‌పై భూమి కేసు గెలిచి అవమానించడం తట్టుకోలేక బందగి అనే ముస్లిం యువకుడిని రజాకార్లు హత్య చేశారు. సినిమాలో దీనిని చూపించలేదు.




**సంస్థాన ఆగడాలను ఇమ్రోజ్ పత్రిక ద్వారా తెలియజేస్తున్న షోయబుల్లా ఖాన్ హత్యను చూపించింది. మతాలకు అతీతంగా వెట్టిచాకిరి, శ్రమ దోపిడి, విద్యావ్యాప్తి మొదలగు అంశాలపై ఆయన తన కలాన్ని ఉపయోగించిన వైనాన్ని చూపించలేదు. సంస్థానంలో ట్రేడ్ యూనియన్ ఉద్యమాన్ని నిర్మిస్తూ, కార్మికులపై దౌర్జన్యాలకు పాల్పడుతున్న పెట్టుబడిదారుల ప్రైవేట్ సైన్యం రజాకార్లను దునుమాడిన మఖ్దూం మొహియుద్దీన్ పాత్ర లేదు. ఆల్ హైద్రాబాద్ స్టూడెంట్స్ సంఘ స్థాపకులు ఆలం, జువాద్ రజ్వీ, షాహిద్‌ల ప్రస్తావన లేదు.**

దాశరథి సోదరులు నిజాం రాచరిక, భూస్వామ్య రజాకార్ వ్యతిరేక పోరాటంలో ప్రత్యక్ష భాగస్వాములు. జైలు జీవితాన్ని గడిపినవాళ్లు. ఆ పోరాటాన్ని తమ సాహిత్యం ద్వారా నమోదు చేసిన వాళ్లు. 1940వ దశకంలో తెలంగాణలో పెల్లుబికిన విప్లవ దావానలం నిజాం దొరల పాలనను కూల్చింది. మూడువేల గ్రామాల్లో గ్రామ రాజ్య కమిటీలు పది లక్షల ఎకరాల భూములను పంచిపెట్టాయి. ఇది భారత చరిత్రలో శిఖరస్థాయి ఉద్యమం. దీనిని అందుకునే ఉద్యమం గతంలో లేదు. ఈ ఘనత కమ్యూనిస్ట్ పార్టీదే. మట్టి మనుషులతో పాటు ఆ పోరాటాన్ని నడిపించిన సేనాని రావి నారాయణ రెడ్డిదే.

భూస్వామ్య కుటుంబంలో పుట్టి తన భూమిని ప్రజలకు ధారాదత్తం చేసిన మానవీయ నేత రావి నారాయణరెడ్డి ప్రస్తావన ఒక్కసారి కూడా సినిమాలో లేదు. ఆంధ్ర మహాసభను కమ్యూనిస్ట్ పార్టీగా మార్చి భూస్వామ్య దోపిడీ, పీడనలకు వ్యతిరేకంగా పోరాడే సంస్థగా మార్చాడు రావి నారాయణ రెడ్డి. మఖ్దూం, ఎల్లారెడ్డిలతో కలిసి సాయుధ పోరాటానికి పిలుపునిచ్చాడు. రావి లేకుండా తెలంగాణ చరిత్ర లేదు. మొదటి సార్వత్రిక ఎన్నికలలో తెలంగాణలో అత్యధిక స్థానాలను కమ్యూనిస్ట్ పార్టీ గెలుచుకున్నది. సంస్థాన ప్రాతిపదికన కాకుండా తెలంగాణకు పరిమితమైతే రావి నారాయణరెడ్డి మొదటి ముఖ్యమంత్రి అయ్యేవారు.


ఇంటిని పోరాట కేంద్రంగా మలిచిన చాకలి ఐలమ్మ భూ పోరాటాన్ని చూపించి దానికి సహకరించి నడిపించిన కమ్యూనిస్ట్ పార్టీని ఉద్దేశపూర్వకంగా ఈ సినిమాలో చూపెట్టలేదు. భీంరెడ్డి నర్సింహారెడ్డి ప్రస్తావన.. ఐలమ్మ, బైరాన్‌పల్లి సంఘటనలలో రక్షకుడిగా, ఆయుధాలను పంపించిన వ్యక్తిగా ప్రస్తావించారు. ఎర్ర జండాలను చేతబట్టి వేలమందితో జైత్రయాత్ర చేస్తూ దొరల నుంచి గ్రామాలను విముక్తి చేసిన భీంరెడ్డి చిత్రణ లేదు. రజాకార్ల క్యాంపులపై దాడులు చేసి వారి ఆయుధాలను లాక్కొని ప్రజలతో దళాలు నిర్మించిన విప్లవసింహం నల్లా నర్సింహ కనిపిస్తాడని.. దొడ్డి కొమురయ్య సహా వందమంది వీరులను ఇచ్చిన కడవెండి ప్రజలు భావించారు. గుర్రాలపై స్వారీ చేస్తూ మల్లు స్వరాజ్యం కనిపిస్తుందని ప్రజలు భావించారు. కానీ, ఇవేమీ సినిమాలో లేవు.

నిజాం రాజు.. రజాకార్లు, పటేల్‌తో లోపాయికారి ఒప్పందం కుదుర్చుకుని రైతాంగ దళాలను వీలైనంతవరకు అణచివేసే ప్రయత్నం చేశాడు. నాలుగు వేలమందికి పైగా ప్రజలను చంపాడు. అయినా పురోగమిస్తున్న సాయుధ పోరాటంతో చేతులెత్తేసిన నిజాం రాజు ఆహ్వానం మేరకు 1948 సెప్టెంబర్ 13 నుంచి 17 వరకు అప్పటి కేంద్ర హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ పోలీసు చర్యను కొనసాగించారు. భారత సైన్యం నిజాం పోలీసులు, రజాకార్ల జోలికి వెళ్లలేదు. రాచరిక భూస్వామ్య వ్యవస్థపై పోరాడుతున్న ప్రజలను, కమ్యూనిస్ట్ దళాలను అణచివేయడానికి మాత్రమే పనిచేశాయి. అత్యంత క్రూరమైన దాడులకు పాల్పడిన ఖాసిం రజ్వీకి నామమాత్ర శిక్ష వేశారు. నిజాంను రాజ ప్రముఖ్ చేశారు. ఇవేమీ చిత్రంలో చోటు చేసుకోలేదు.

ఆకలి, అసమానతలు, పేదరికం లేని దేశంగా మార్చే బదులు ప్రతిపక్ష రహిత, గాంధీ రహిత దేశంగా మార్చే దిశగా పాలకులు కొనసాగుతున్నారు. బహమనీ రాజ్యం నుంచి అసఫ్ జాహీ కాలం వరకు కొనసాగిన మత, సామరస్య, సహజీవనాన్ని వక్రీకరిస్తూ ప్రచారం చేస్తున్నారు. కాబట్టి తెలంగాణ గత చరిత్ర, సాంస్కృతిక వారసత్వం హేతుబద్ధమైన దృక్పథంతో నిత్యం ప్రచారంలో ఉండే బాధ్యతను తెలంగాణలోని పాలక ప్రతిపక్షాలు తీసుకోవాలి.

ప్రొఫెసర్ జయశంకర్ సార్ చెప్పినట్టు రాజకీయంగా, ఆర్థికంగా నష్టపోతే కోలుకోవచ్చు కానీ, చరిత్ర, సంస్కృతి, అవి అందించిన వారసత్వాన్ని మర్చిపోతే మాత్రం జాతి కోలుకోలేదు. ఈ శూన్యాన్ని మతోన్మాదులు ఉపయోగించుకొని కట్టుకథలతో తమ వశం చేసుకుంటారు. ఈ శక్తులను నిర్వీర్యం చేసే బాధ్యతలో దేశానికి మార్గదర్శిగా నిలబడటమే మన ముందున్న కర్తవ్యం.

**(వ్యాసకర్త: వ్యవస్థాపకులు దొడ్డి కొమురయ్య ఫౌండేషన్)**




## కాంగ్రెస్ వల్లే మోదీ గెలుపు



"మోదీ ఓటమి చెందక పోవడానికి కాంగ్రెస్సే కారణం. ఆ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లోనూ విజయాలు సాధించలేకపోతున్నది. తెలంగాణ, కర్ణాటకల్లో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పటికీ బీజేపీనే పైచేయి సాధించింది."

**- రాంగోపాల్ యాదవ్**
**రాజ్యసభ సభ్యుడు, సమాజ్‌వాదీ పార్టీ**